సాక్షి
మెదక్

శనివారం । 5 । జూలై । 2025



వడివడిగా ఫార్మర్ రిజిస్ట్రీ

'ఫార్మర్ రిజిస్ట్రీ' పేరుతో ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్య కేటాయించే ప్రక్రియ సాగుతోంది. వివరాలు 8లో ▸



కన్న తండ్రే కడతేర్చాడు

మద్యానికి బానిసై వేధిస్తున్న కొడుకును కడతేర్చిన తండ్రిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలు 8లో ▸



ఆయిల్‌పామ్‌తో లాభాలు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు అర్జించవచ్చని రైతులకు అధికారులు సూచించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఖర్గేకు సన్మానం



ఖర్గేకు పార్టీ కండువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ' కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి' సభలో పాల్గొన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ సన్మానించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ మహిపాల్

కొల్చారం(నర్సాపూర్): ఎన్నికల విధులను సమర్థవంతగా నిర్వర్తించాలని ఆర్డీఓ మహిపాల్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్‌ఓలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఎలాంటి ఒత్తిడికి లోనూ కావొద్దన్నారు. బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ కార్డును పరిశీలించాలన్నారు. అంతకు ముందు మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల పత్రాలపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, మాస్టర్ ట్రైనర్లు లక్ష్మీనారాయణ, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

మెదక్ కలెక్టరేట్: దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేల రాలిన తొలి అమరుడని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బీసీ సామాజిక ఉద్యమ నాయకుడు దొడ్డి కొమురయ్య, మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతిని వేర్వేరుగా నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ నగేష్, ఇతరశాఖల అధికారులు ఉన్నారు.

ఉత్తమ పంచాయతీల ఎంపికపై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): జాతీయ ఉత్తమ పంచాయతీల ఎంపిక, అవార్డులపై శుక్రవారం మెదక్ డీఎల్‌పీఓ సురేష్‌బాబు ఆయా శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ ఉత్తమ పంచాయతీల ఎంపికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ షాకీర్‌అలీ, ఎంఈఓ వెంకటేశం, ఏఓ కృష్ణ, ఏఎస్ఐ చంద్రమోహన్, ఏపీఎం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మారనున్న వీధి రాత

వీధి వ్యాపారులను పొదుపు వైపు మళ్లించి వ్యాపార అభివృద్ధికి బ్యాంకుల ద్వారా రుణాలిప్పించాలని ప్రభుత్వం యోచిస్తుంది. అందులో భాగంగా జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీల్లో కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్ (సీఐజీ)లను ఏర్పాటు చేయాలని మెప్మాకు ఆదేశాలు ఇచ్చింది. ఈమేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

– రామాయంపేట(మెదక్)





రామాయంపేటలో పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్న స్థానికుడు

- వీధి వ్యాపారులతో పొదుపు సంఘాలు
- మున్సిపాలిటీల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- మెప్మాకు ప్రభుత్వం ఆదేశం
- బ్యాంకుల నుంచి రుణ సదుపాయం

జిల్లావ్యాప్తంగా నాలుగు మున్సిపాలిటీల్లో 74 వరకు సంఘాలు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ప్రతి గ్రూపులో ఐదు నుంచి పది మంది సభ్యులు ఉండేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే జిల్లాలో మొదటి విడతగా మొత్తం 8,200 మంది వీధి వ్యాపారులను గుర్తించారు. వీరితో ఏర్పాటు చేసే గ్రూపుల్లో ఎంపిక చేసిన సంఘాల్లోని సభ్యులకు ముందుగా శిక్షణ ఇవ్వనున్నారు. వారు బ్యాంకు ఖాతాలు తెరిచిన వెంటనే సంఘాల పొదుపు ప్రక్రియను పరిశీలించి బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించనున్నారు. ఆరునెలల తర్వాత సంఘాలకు మొదటి విడతగా రూ. లక్ష, తర్వాత రూ. 3 నుంచి రూ. 5 లక్షలు, సకాలంలో చెల్లిస్తే రూ. 10 నుంచి రూ. 15 లక్షల వరకు రుణం పొందవచ్చు. అలాగే వీధి వ్యాపారులు ప్రత్యేకంగా వ్యాపారం చేసుకోవడానికి వీలుగా పీఎం స్వానిధి పథకం కింద దుకాణాలు నిర్మించనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రమైన మెదక్‌లో పోస్టాఫీస్ పక్కనే 25 రేకుల షెడ్లు నిర్మించారు. త్వరలో వీటిని వీధి వ్యాపారులకు కేటాయించనున్నారు. మిగితా మూడు మున్సిపాలిటీల్లో సైతం వీటిని నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.



మెదక్‌లో వీధి వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లు

జిల్లా వివరాలు..		
మున్సిపాలిటీ	వీధి వ్యాపారులు	ఏర్పాటు చేసే సంఘాలు
మెదక్	4,096	25
నర్సాపూర్	1,222	15
తూప్రాన్	1,562	14
రామాయంపేట	1,320	20

సభ్యులకు బీమా సదుపాయం

పొదుపు సంఘంలో సభ్యులుగా చేరిన వ్యాపారులకు రూ. 2 లక్షల బీమా సదుపాయం కల్పించనున్నారు. ప్రమాదవశాత్తు సభ్యులు మృతిచెందితే వారికి బీమా వర్తిస్తుంది. ఈ మేరకు వీధి వ్యాపారులకు ఆయా మున్సిపాలిటీల పరిధిలో గుర్తింపు కార్డులు అందజేశారు. దుకాణాలు కేటాయించిన అనంతరం వారితో పట్టణ వ్యాపారుల కమిటీని ఏర్పాటు చేయనున్నారు. కమిటీ చైర్మన్‌గా మున్సిపల్ కమిషనర్ ఉంటారని సమాచారం.

ఇబ్బందులు తప్పుతాయి

డబ్బులు లేక సక్రమంగా వ్యాపారాలు చేసుకోలేకపోతున్నాం. నాతో పాటు చాలా మంది ప్రైవేట్ వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యాపారం కొనసాగిస్తున్నాం. అప్పులు పోనూ తమకు ఏమి మిగలడం లేదు. సంఘం ద్వారా రుణలు ఇప్పిస్తే మంచిగా వ్యాపారం చేసుకుంటాం. – అజీజ్‌ఖాన్, పండ్ల వ్యాపారి

వారికి వెసులుబాటు కలుగుతుంది



నాలుగు మున్సిపాలిటీల్లో వీధి వ్యాపారులతో పొదుపు సంఘాలు ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో ఏర్పాటయ్యే సంఘాలకు బ్యాంకుల నుంచి రుణం ఇప్పించడానికి కృషి చేస్తున్నాం. దీంతో వారికి వెసులుబాటు కలుగుతుంది. కుటుంబాలను పోషించుకోవడానికి అవకాశం ఉంటుంది. – హన్మంతరెడ్డి, మెప్మా పీడీ

ప్రయాణికులకు బస్సులు కరువు

దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): ప్రయాణికులకు సరిపడా బస్సులు లేవని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంపూర్ శివారులో ఆర్టీసీ బస్సులో సౌకర్యాలను పరిశీలించారు. ఉచిత బస్సు ప్రయాణం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేగుంట–దుబ్బాక రూట్‌లో ఒకే బస్సు నడుస్తుందని పలువురు వివరించారు. అనంతరం బస్సు డ్రైవర్ కండక్టర్‌తో మాట్లాడి బస్సులపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రయాణికులకు సరిపడా బస్సులను నడిపించడం లేదని ఆరోపించారు. ఉన్న బస్సుల్లో సౌకర్యాలు లేవని తెలిపారు. అధికారులు వెంటనే చేగుంట– దుబ్బాక రూట్‌లో ప్రయాణికులకు సరిపడా బస్సులు నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా నాయకులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

పప్పు ధాన్యాలు సాగు చేయాలి

ఏడీఏ రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): వరికి ప్రత్యామ్నాయంగా పప్పు ధాన్యాల పంటలు సాగు చేయాలని ఏడీఏ రాజ్‌నారాయణ సూచించారు. శుక్రవారం రామాయంపేటలోని వ్యవసాయ కార్యాలయంలో కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పప్పుజాతి పంట సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని, దీంతో పాటు చీడపీడల బాధ ఉండదన్నారు. ప్రతిసారీ ఒకే పంటను సాగు చేస్తే నేల సంరక్షణ దెబ్బతింటుందన్నారు. కంది విత్తనాలు అవసరమైన రైతులు తమ పాస్ పుస్తకాలు, ఆధార్‌కార్డుల జిరాక్స్ ప్రతిని కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పారదర్శకంగా అవార్డుల ఎంపిక

డీఎల్పీఓ సాయిబాబా

కొల్చారం(నర్సాపూర్): గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించడంలో ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై కేంద్ర ప్రభుత్వం నేషనల్ పంచాయతీ అవార్డ్స్– 2025కు గ్రామాలను ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకుంటుందని డీఎల్పీఓ సాయిబాబా అన్నారు. శుక్రవారం శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఎంపిక ప్రక్రియలో పారదర్శకత వహించాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. నేషనల్ పంచాయతీ అవార్డ్స్ ఎంపిక కోసం ప్రధానంగా తొమ్మిది అంశాల్లో గ్రామాభివృద్ధిపై గ్రేడింగ్ మార్కులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అధికారులు సమన్వయంతో తమకు కేటాయించిన గ్రా మాల్లో సర్వే నిర్వహించి నివేదికను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీక్ ఉన్నిసా, ఎంపీఓ కృష్ణవేణి, ఎంఈఓ శ్రీనివాస్‌చారి సిబ్బంది పాల్గొన్నారు.

ముసురుకుంటున్నాయ్..

- జ్వరాలతో జనం విలవిల
- జిల్లాలో నాలుగు డెంగీ కేసులు నమోదు

మెదక్‌జోన్: వ్యాధులు ముసురుకుంటున్నాయి. ఇప్పటికే జిల్లాలో నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. వేలాది మంది జ్వరాలతో మంచం పట్టారు. గ్రామాలు చెత్తతో పేరుకుపోయి దుర్వాసనతో కంపుకొడుతున్నాయి. ఈగలు, దోమలకు నిలయంగా మారి వ్యాధులు విజృంభిస్తున్నాయి. అయినా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

7,389 మందికి జ్వరాలు

జిల్లాలో జూన్ నుంచి ఇప్పటివరకు నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇందులో 3 కేసులు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో నమోదు కాగా, మరొకటి హవేళిఘనాపూర్ మండలం బూర్గుపల్లి గిరిజన తండాలో నమోదైంది. అక్కడ ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవటంతో దోమలకు నిలయంగా మారిందని వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే ముందస్తు చర్యల్లో భాగంగా జ్వర సర్వే కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు 7,389 మందికి జ్వరాలు రాగా, వారికి చికిత్స అందిస్తున్నారు. జ్వర పీడితులు ఎక్కువగా ఉన్న గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించి డెంగీ, మలేరియా లాంటి పరీక్షలు చేస్తున్నారు.



మెదక్ మండలం మక్తభూపతిపూర్‌లో పేరుకుపోయిన చెత్త

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె బాట!

జిల్లావ్యాప్తంగా 492 గ్రామ పంచాయతీలు ఉండగా, 1,697 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి గత నాలుగు మాసాల నుంచి వేతనాలు రావటం లేదు. నెలల తరబడి వేతనాలు రాకపోవటంతో కుటుంబాలు గడవటం లేదని, వేతనం ఇస్తే తప్ప పనులు చేయమని ఇటీవల పలు మండలాల్లో కార్మికులు ఎంపీడీఓలకు వినతిపత్రాలు అందించారు. ఇప్పటికే చెత్త ట్రాక్టర్లకు డీజిల్ పోయలేమని కార్యదర్శులు చేతులెత్తేశారు. దీంతో గ్రామాల్లో చెత్త సేకరణ నిలిచిపోయింది. ఇక కార్మికులు సైతం పనులు మానేస్తే పల్లెలు మరింత అధ్వానంగా మారే పరిస్థితి నెలకొంటుందని పలువురు వాపోతున్నారు.

నిరంతరం వైద్య పరీక్షలు

వానాకాలంలో సీజనల్ వ్యాధుల కట్టడికి నిరంతరం కృషి చేస్తున్నాం. ఆశావర్కర్లు గ్రామాల్లో జ్వర సర్వే చేసి ఏఎన్ఎంలకు సమాచారం ఇస్తున్నారు. వారు జ్వర పీడితులకు మందులు అందజేస్తున్నారు. అనుమానితులకు రక్త పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 4 డెంగీ కేసులు నమోదు కాగా, వారికి చికిత్స అందించాం.

– శ్రీరాం, డీఎంహెచ్ఓ



తూప్రాన్ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

గురుకులాల్లో నాణ్యమైన విద్య

కలెక్టర్ రాహుల్‌రాజ్

తూప్రాన్/నర్సాపూర్: ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో పలు గురుకులాలు, కళాశాలను తనిఖీ చేశారు. కిచెన్, డైనింగ్ హాల్, తరగతి గదులు, స్టోర్ రూంలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా..? అని ఆరా తీశారు. బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. కాల పరిమితి ముగిసిన వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని నిర్వాహకులను హెచ్చరించారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండ పాఠశాల సముదాయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం నర్సాపూర్‌లో మండలంలోని గురుకుల పాఠశాలలు, కాలేజీలను తనిఖీ చేశారు. సమస్యలు తెలుసుకొని, సౌకర్యాలు మెరుగుపరిచే దిశగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యత లేని బియ్యం వస్తే ఎంఈఓలకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

మెదక్‌జోన్/మెదక్‌మున్సిపాలిటీ: మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపాలని, అందుకోసం సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమాజానికి చీడ పురుగులా మారిన నిరోధానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో మాదకద్రవ్యాల నిరోధానికి పోలీస్‌శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద సైన్ బోర్డులు రేడియం స్టికర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

'మైనంపల్లి'వి గొప్పలే.. చేతల్లేవ్

- తన హయాంలో మంజూరైన పనులకు శంకుస్థాపనలు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి ఫైర్

రామాయంపేట(మెదక్): తమ హయాంలో మంజూరైన నిధులతో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శంకుస్థాపనలు చేస్తూ, తానే నిధులు మంజూరు చేయించానని గొప్పలు చెప్పుకుంటున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధిని మరిచిన ఎమ్మెల్యే ప్రతిపక్షాలను దూషించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఇప్పటివరకు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. తమ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 30 కోట్లు మంజూరయ్యాయని, ఈ మేరకు టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయిందని తెలిపారు. వాటికే ఎమ్మెల్యే మళ్లీ శంకుస్థాపన చేశారని విమర్శించారు. వాటికి సంబంధించిన జీఓ కాపీలను చూపించారు. మెదక్‌లో మెడికల్ కాలేజీ తమ హయాంలో మంజూరు చేయించగా, తానే చేయించినట్లు ఎమ్మెల్యే తప్పుడు ప్రకటనలు చేయడం తగదని హితవు పలికారు. రహదారుల నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రామాయంపేట, మెదక్‌లో వందలాది డబుల్ బెడ్రూం ఇళ్లను నిరుపేదలకు పంచామన్నారు. ప్రజలు తరతరాలుగా మర్చిపోని విధంగా కేసీఆర్ అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రామాయంపేట, చిన్నశంకరంపేట కెనాల్స్, రామాయంపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను రద్దు చేయించారని ఆరోపించారు. సమావేశంలో సహకార సంఘం అధ్యక్షుడు బాదె చంద్రం, మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ యూత్ మండలాధ్యక్షుడు జలందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పద్మారెడ్డి

పిల్లల భద్రతపై చర్యలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్ కలెక్టరేట్: పిల్లల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ముందుగా మైనార్టీ పాఠశాలను పరిశీలించి మధ్యాహ్న భోజనం, వసతి సౌకర్యాలను ఆరా తీశారు. అనంతరం గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాలను పరిశీలించారు. అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని పెంపొందించే దిశలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

కొలువుదీరిన నాచగిరి పాలకవర్గం

- చైర్మన్‌గా రవీందర్‌గుప్తా ఏకగ్రీవం
- ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లాలో సుప్రసిద్ధమైన నాచారం గుట్ట లక్ష్మీ నృసింహ క్షేత్రంలో శుక్రవారం నూతన ధర్మకర్తల మండలి కొలువుదీరింది. నాచగిరి ఆలయ ముఖమండపంలో ధర్మకర్తల ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ధర్మకర్తలుగా జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా, దేశపతి ఉషశ్రీ, గాల కిష్టయ్య, కర్రె పద్మ, జగ్గన్నగారి సురేందర్‌రెడ్డి, జే.ఎస్ తిరుమల్‌రావు, రుద్ర శ్రీహరి, కొత్తపల్లి శ్రీనివాస్, చందా నాగరాజుగుప్తతోపాటు, ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా జగన్నాథాచార్యులుతో ఆలయ సహాయ కమిషనర్ విజయరామారావు, ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మిలు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల ఏకగ్రీవ ఆమోదంతో పల్లెర్ల రవీందర్‌గుప్తా చైర్మన్‌గా ఎన్నికయ్యారు. నూతన చైర్మన్‌ను మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అభినందిస్తూ సన్మానించారు. చైర్మన్, పాలక మండలి ధర్మకర్తలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, విజయమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి తదితరులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా శనివారం నాచగిరి ఆలయ పాలకమండలి సమావేశం, సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు.



చైర్మన్ రవీందర్‌గుప్తా, ధర్మకర్తలతో ఈఓ విజయరామారావు, నర్సారెడ్డి

క్లుప్తంగా

మెదక్ పోక్సో కోర్టు పీపీగా బాలయ్య



చిన్నశంకరంపేట(మెదక్‌): మండలంలోని టీ.మాందాపూర్ గ్రామానికి చెందిన న్యాయవాది ఎం.బాలయ్య మెదక్ పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ హోంశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల పాటు ఈ పదవిలో బాలయ్య కొనసాగనున్నారు. 1999లో మెదక్ కోర్టులో న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించిన ఆయన బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ప్రభుత్వ న్యాయవాదిగా పేదలకు న్యాయం చేస్తానని బాలయ్య తెలిపారు. తనకు ఈ అవకాశం దక్కేందుకు సహకరించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కిక్ బాక్సింగ్‌లో చిన్నారి ప్రతిభ



భవజ్ఞకు పతకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ (అండర్–12) పాయింట్ ఫైట్, లైట్ కాంటాక్ట్, కిక్‌లైట్ మూడు విభాగాల్లో చిన్నారి మూడు బంగారు పతకాలు సాధించింది. జగ్గంపేట గ్రామంలోని నవభారతి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న నీరుడి భవజ్ఞ గత నెల 28, 29 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన ఓపెన్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి స్పారింగ్ విభాగంలో ప్రతిభ కనబర్చింది. ఆగస్టులో తమిళనాడులో నిర్వహించే జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించింది. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆమెను సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. అభినందించిన వారిలో హెచ్‌ఎం శ్రీకాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో చోరీ

రూ. 80 వేలు అపహరణ

కొల్చారం(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని రంగంపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఇద్దునూరి ఏగొండ ఇంటికి తాళం వేసి పని ఉండటంతో బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి, వస్తువులన్నీ చిందరవందరగా పడేసి కనిపించాయి. ఇంటి పైకప్పు రేకులను తొలగించి, ఇంట్లోకి దూరిన దొంగలు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపాడు. నాలుగు రోజుల క్రితం ఇదే ఇంట్లో దాచుకున్న రూ.80 వేల నగదు దోచుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఎండు గంజాయి స్వాధీనం



గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

మునిపల్లి(అందోల్): ఎండు గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ స్టేషన్ సీఐ శంకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వకీల్ యాదవ్ అక్రమంగా ఆర్టీసీ బస్సులో తెస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 765 గ్రాముల ఎండు గంజాయిని, ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు హనుమంతు, అనుదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

బోటు షికారు

నిండుకుండ లాంటి చెరువులో తామరలు విరబూయగా.. నీలాకాశంలో తెల్లని మబ్బులు కనువిందు చేస్తున్నాయి. నీటి అలలపై.. స్పీడ్ బోట్‌లో వెళ్తూ పర్యాటకులు ఎంజాయ్ చేశారు. ఆకాశమే హద్దుగా మువ్వన్నెల జెండా రెపరెపలాడుతున్న ఆ సుందర దృశ్యాలు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు ట్యాంక్‌బండ్‌పై ఒకే చోట కనిపించాయి. ఆ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



వడివడిగా ఫార్మర్ రిజిస్ట్రీ

ముందు వరుసలో జహీరాబాద్ డివిజన్
- 40 శాతం మేర రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి
- ఆధార్ తరహాలో 11 అంకెల కార్డు కేటాయింపు
- జహీరాబాద్, సదాశివపేట మున్సిపాలిటీల్లో బ్రేక్



రంజోల్ గ్రామంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ ప్రదీప్

జహీరాబాద్: 'ఫార్మర్ రిజిస్ట్రీ' పేరుతో ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్య కేటాయించే ప్రక్రియకు వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ నుంచి రైతు వేదికల్లో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏఈఓలు చేపట్టారు. ఈ ప్రక్రియలో జహీరాబాద్ డివిజన్ ముందు వరుసలో ఉంది. ఇప్పటి వరకు 40 శాతం పూర్తయింది. న్యాల్‌కల్ మండలంలో 42 శాతం, ఝరాసంగంలో 39 శాతం, కోహీర్‌లో 36 శాతం, మొగుడంపల్లిలో 35 శాతం, జహీరాబాద్ మండలంలో 34 శాతం మేర ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

జిల్లాలోని జహీరాబాద్, సదాశివ మున్సిపాలిటీల్లో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు బ్రేక్ పడింది. పటాన్‌చెరు పాత మున్సిపల్ పరిధిలో కూడా నమోదు కావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. రంజోల్, చిన్న హైదరాబాద్, అల్లీపూర్, పస్తాపూర్, హోతి(కె) గ్రామాల పరిధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాఫీగా కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు రైతులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. పక్షం రోజుల నుంచి విత్తనాలు వేసుకునే పనిలో నిమగ్నం కావడంతో కొంత నెమ్మదించింది. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాల కోసం ఫార్మర్ రిజిస్ట్రీని తప్పనిసరి చేశారు.

ఉపయోగాలు..

కేంద్ర పథకాలు అమలు చేసేందుకు ఆధార్ కార్డు మాదిరిగా రైతులకు ప్రత్యేక కోడ్ ఉండాలనే ఉద్దేశంతో సాగుదారుల సంఖ్యను ఇవ్వనున్నారు. ఈ కార్డు ద్వారా పీఎం కిసాన్, క్రాప్ లోన్, పంటల బీమా, యాంత్రీకరణ పరికరాలు అందించనున్నారు. బ్యాంకు రుణాలకు వెళ్లినప్పుడు పాసు పుస్తకం లేకుండా, ధాన్యం కొనుగోళ్లకు ఈ కార్డును వర్తింపజేయనున్నారు.

నమోదు ఇలా..

సాగుదారుల సంఖ్య కార్డు నమోదుకు రైతులు తగిన సమాచారంతో వెళ్లాలి. ఆధార్‌కార్డు లింకు ఉన్న సెల్‌ఫోన్ నంబరు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకెళ్లాలి. వ్యవసాయ సిబ్బంది ప్రత్యేక యాప్‌ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అనంతరం రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఈ నంబరును సిబ్బందికి చెబితే 11 అంకెల ప్రత్యేక గుర్తింపుకార్డు సంఖ్యను కేటాయిస్తారు.

ఎప్పటి వరకు ఎదురు చూడాలి?



ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ప్రారంభించి మూడు నెలలవుతోంది. అయినా జహీరాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి ఇప్పటికీ ప్రారంభించలేదు. దీంతో తాము ప్రభుత్వ పథకాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి వెంటనే రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్ ప్రారంభించాలి.

–బి.మాధవరెడ్డి, రైతు, జహీరాబాద్

పథకాలకు దోహదం



ప్రభుత్వం ఇచ్చే పథకాలకు సాగుదారుల సంఖ్య ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతి పనికి ఈ కార్డును తీసుకెళితే సరిపోతుంది. ఫార్మర్ రిజిస్ట్రీలో జహీరాబాద్ జిల్లాలోనే ముందంజలో ఉంది. మున్సిపల్ పరిధిలో రెవెన్యూ భూములకు సంబంధించిన ప్రక్రియ ఇప్పటికీ ప్రారంభం కాలేదు. సాంకేతిక సమస్యలతో నమోదు చేయలేకపోతున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారం కాగానే ప్రారంభిస్తాం.

–భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

మంచి ఫలితాలు సాధించేందుకే సదస్సులు

ఇంపాక్ట్ రీజినల్ అధ్యక్షుడు రాజేశ్వర్



విద్యార్థులను సన్మానిస్తున్న ఎస్‌ఐ, ఇంపాక్ట్ సభ్యులు

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇంపాక్ట్ సంస్థ సంగారెడ్డి జిల్లా రీజినల్ అధ్యక్షుడు రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం అల్లాదుర్గం కేజీబీవీ, ప్రభుత్వ జెడ్పీ పాఠశాలలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించి జ్ఞాపిక, పారితోషికం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ రీజినల్ కార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి లావణ్య, సర్వీస్ కోఆర్డినేటర్ రమేశ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి, ఎస్‌ఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతోనే పాఠ్యాంశాలు చదివించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జీసీడీఓ సుప్రియ

మునిపల్లి(అందోల్): విద్యార్థినులతో ఒకటికి రెండు సార్లు ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను చదివించాలని జీసీడీఓ (గర్ల్స్ చైల్డ్ డెవలప్ మెంట్) అధికారి సుప్రియ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకు ముందు రికార్డులు, వంట గదులు, తాగునీటి సౌకర్యం, నాణ్యమైన భోజనం పెడుతున్నారా? లేరా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువులో ఒకరి కంటే ఒకరు పోటీపడి చదవాలన్నారు. అప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలుగుతారని తెలిపారు. ప్రహరీగోడ, అదనపు తరగతి గదులు, ఇంటర్మీయెట్‌కు రెగ్యూలర్ అధ్యాపకులను ఏర్పాటు చేయడానికి జిల్లా అధికారులు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

డయాలసిస్ పేషెంట్లకు మనోధైర్యం ఇవ్వాలి

సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డయాలసిస్ వ్యాధిగ్రస్తులు

సిద్దిపేటకమాన్: డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం ఇవ్వాలని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలో కిడ్నీ బాధిత పేషెంట్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం పేషెంట్లకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి అనగోని రాజు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో కిడ్నీ సమస్యతో బాధపడుతూ అధిక సంఖ్యలో డయాలసిస్ సేవల కోసం వస్తున్నారని తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి ఆర్‌ఎఫ్‌టీ నిర్వహించడం ద్వారా కిడ్నీ పనితీరు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఎంఓలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ సదానందం, డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

కన్న తండ్రే కడతేర్చాడు

- మద్యానికి బానిసై నిత్యం కొడుకు వేధింపులు
- రోకలిబండతో బాది చంపిన తండ్రి
- వివరాలు వెల్లడించిన అల్లాదుర్గం సీఐ



మాట్లాడుతున్న అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): మద్యానికి బానిసై నిత్యం వేధిస్తున్న కొడుకును కడతేర్చిన తండ్రిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. బుధవారం అర్ధరాత్రి ఇంటి ముందు పడుకున్న తోట సుధాకర్(43) హత్యకు గురైన విషయం విధితమే. విలేకరుల సమావేశంలో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని కమలాపూర్ గ్రామానికి చెందిన తోట సుధాకర్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం తాగి తల్లిదండ్రులతో గొడవపడేవాడు. ఇటీవల మృతుడి తల్లి మణెమ్మ పెద్ద కుమారుడు సాయిలు దగ్గరికి వైద్యం కోసం వెళ్లింది. బుధవారం తండ్రి నర్సింహులు, పిల్లలు మాత్రమే ఇంట్లో ఉన్నారు. కాగా తండ్రి వద్ద ఇటీవల ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బుల నుంచి సుధాకర్ తనకు రూ.30 వేలు ఇవ్వాలని తండ్రితో రాత్రి గొడవపడ్డాడు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. దీంతో విసుగు చెందిన తండ్రి ఇంట్లో ఉన్న రోకలిబండతో ఆరుబయట పడుకున్న సుధాకర్ తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతుడి భార్య చనిపోగా, 13 ఏళ్ల వికలాంగుడైన కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్‌ఐ.ప్రవీణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ బంగారం కలకలం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ బ్యాంకులో బంగారం కుదవ పెట్టి రుణం తీసుకున్నారు. తీరా రుణం చెల్లించాల్సిన సమయం దాటిపోవడంతో రెన్యువల్ చేయలేక మరోకరి చేత డబ్బులు కట్టించి ఆ బంగారాన్ని వారికి అమ్మాడు. వారు ఆభరణాలు చేయించడానికి తీసుకెళ్లగా నకిలీ బంగారమని తేలింది. ఈ ఘటన జగదేవ్‌పూర్ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన ఓ యువకుడు ఉపాధి కోసం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కొంత కాలంగా ఉంటున్నాడు. ఆ సమయంలో వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తి పరిచయమై తన దగ్గర బంగారం ఉందని, విక్రయాలు జరిపితే లాభాలు పొందొచ్చని నమ్మించాడు. దీంతో పది తులాలకు పైగా బంగారాన్ని కొంత డబ్బు చెల్లించి తీసుకున్నారు. ఇటిక్యాలకు చెందిన ఇద్దరు వ్యక్తులకు తన దగ్గర ఆరు తులాల బంగారం ఉందని, తనకు డబ్బులు అత్యవసరమని నమ్మించి వారికి విక్రయించి బ్యాంకులో రుణం తీసుకోవాలని సూచించారు. వారిద్దరూ జగదేవ్‌పూర్‌లోని ప్రభుత్వ రంగ బ్యాంకులో తనఖా పెట్టి రూ.3 లక్షల వరకు లోన్ తీసుకున్నారు. ఏడాది దాటినా రుణం చెల్లించలేదు. దీంతో బ్యాంకు అధికారులు రుణం చెల్లించాలని పట్టుబట్టగా బంగారం ఇప్పించిన వ్యక్తి అదే గ్రామంలో డబ్బులున్న మరో ఇద్దరి వ్యక్తులను నమ్మించి బ్యాంకు రుణం చెల్లిస్తే కొంత లాభం ఉంటుందని చెప్పాడు. తిరిగి మొదట తీసుకున్న బ్యాంకు బకాయిలు చెల్లించి కొత్తగా రుణం తీసుకున్నారు.

నకిలీదని తెలిసిందిలా..

ఆ ఇద్దరిలో ఓ వ్యక్తి బంగారం తీసుకుని నగలు చేయించడానికి తెలిసిన వారి వద్ద చూపించగా నకిలీదని తేలింది. దీంతో తాను మోసపోయానని గుర్తించి సదరు బ్యాంకు అధికారులను నిలదీశారు. ఈ క్రమంలో మరో వ్యక్తిని రుణం చెల్లించాలని బ్యాంకు అధికారులు పట్టుబట్టారు. నకిలీ బంగారం విషయం బయటకు పొక్కకుండా బ్యాంకు అధికారులు జాగ్రత్తలు తీసుకుని రుణం తీసుకున్న వ్యక్తికి డబ్బులు తామే చెల్లిస్తామని, తర్వాత డబ్బులు మాకు ఇవ్వాలని ఒప్పందం చేసుకుని లోన్ క్లియర్ చేసినట్లు ఆరోపలున్నాయి. మోసపోయిన బాధితులు గ్రామంలో కొందరికి చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఈ విషయంపై ఎస్‌ఐ చంద్రమోహన్‌ను వివరణ కోరగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

ఇటిక్యాల కేంద్రంగా దందా
- ప్రభుత్వ బ్యాంకుల్లో రుణాలు
- బ్యాంకు నుంచి విడిపించిన తర్వాత నకిలీగా గుర్తింపు
- ఆరు తులాలు మోసపోయిన బాధితులు

మత్తు పదార్థాల దహనం



మత్తు పదార్థాల దహనంలో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

నర్సాపూర్ రూరల్: జిల్లా ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నర్సాపూర్ మండలంలోని కాగజ్ మద్దూర్‌లో గల మరిడి బయో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎక్సైజ్ అధికారులు మత్తు పదార్థాలను దహనం చేశారు. నర్సాపూర్, రామాయంపేట, మెదక్ ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 850 గ్రాముల పొడి గంజాయి, పాపిస్ట్రా పౌడర్ 2340 గ్రాములు, 1.2 కిలోల ఆల్ప్రాజోలంను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సీఐలు గులాం ముస్తఫా, నాగేశ్వరరావు, నరేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎస్సై అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

చదువే భవిష్యత్‌కు పునాది


- జిల్లా కలెక్టర్ హైమావతి
- గురుకులాల ఆకస్మిక తనిఖీ



సిద్దిపేటఅర్బన్: పొన్నాల గురుకులంలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్

వర్గల్(గజ్వేల్)/ములుగు(గజ్వేల్)/సిద్దిపేటఅర్బన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చదువే భవిష్యత్‌కు పునాది అని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సిద్దిపేట కలెక్టర్ కె.హైమావతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం, ఎన్సాన్‌పల్లి, వర్గల్, ములుగు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల స్టడీ అవర్స్, తరగతి గదులను పరిశీలించారు. వారితో ఆప్యాయంగా మాట్లాడారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి వసతులపై ఆరా తీశారు. ప్రతి బాలిక ప్రభుత్వం కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ విజయతీరాలకు చేరుకోవాలని సూచించారు. ప్రయత్నం చేస్తేనే ఏదైనా సాధించగలమన్నారు. విద్యార్థుల భద్రత చాలా ముఖ్యమని, ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీదేవిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మండలంలోని చౌదరిపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. కలెక్టర్ వెంట ఎంజేపీబీసీడబ్ల్యూఆర్‌ఎస్ డీసీఓ శివప్రసాద్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, మల్టీ జోన్ అధికారి అలివేలు, తహసీల్దార్ ఆరిఫా ఉన్నారు.

మేకలను కడిగేందుకు చెరువులోకి దిగి



బాజవిఠల్

టేక్మాల్(మెదక్): ఓ వ్యక్తి ప్రమాదశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన టేక్మాల్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... టేక్మాల్ గ్రామానికి చెందిన బాజ విఠల్(35) వ్యవసాయంతో పాటు, మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ శివారులోని చిన్న చెరువులో మేకలు కడిగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

చేపల వేట నిషేధం

జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కార్ప్ జాతికి చెందిన చేపలు పిల్లలను జూలై, ఆగస్టు నెలల్లో ఉత్పత్తి చేస్తాయని, అందువల్ల మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మల్లన్నసాగర్, కొండ పోచమ్మ, రంగనాయకసాగర్, అన్నపూర్ణ సాగర్ ప్రాజెక్టులలో లైసెన్స్ పొందిన మత్స్యకారులు రెండు నెలలు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా చేపల వేటకు వెళితే మత్స్యకారుల లైసెన్స్‌లు రద్దు చేయబడుతాయని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



షౌకత్

చేగుంట(తూప్రాన్): వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన షౌకత్(44) చేగుంటలో నివాసం ఉంటున్నాడు. గురువారం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల పరిసరాలు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య రుబీనాబేగం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలకు మరింత ప్రోత్సాహం

క్రీడల శాఖ అధికారి వెంకట్ నర్సయ్య



చైతన్యను సన్మానిస్తున్న అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడాలని జిల్లా క్రీడలశాఖ అధికారి వెంకట్ నర్సయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఫుట్‌బాల్ మైదానంలో జిల్లా జూనియర్ బాలికల జట్టు సెలక్షన్స్ ప్రక్రియను జిల్లా క్రీడా సమాఖ్య కన్వీనర్ సాయిరాంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిద్దిపేట జిల్లా జూనియర్ బాలికల జట్టును ఎంపిక చేసినట్లు సెలక్షన్స్ కమిటీ సభ్యులు అక్బర్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా 20మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు ఈనెల 8నుంచి ఆదిలాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. సిద్దిపేట పట్టణానికి చెందిన వడ్లకొండ చైతన్యశ్రీ జాతీయ స్థాయి అండర్ –17 ఫుట్‌బాల్ ప్రాబబుల్స్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గణేష్, జాయింట్ సెక్రటరీ సాజిద్ పాల్గొన్నారు.

ఎరువుల కోసం వచ్చి అనంతలోకాలకు..

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



నర్సింహ రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో రైతు చనిపోయాడు. ఈ ఘటన శుక్రవారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పి.నీరేష్ వివరాల ప్రకారం... మద్దూరు మండలం నర్సాయపల్లికి చెందిన కొమ్మూరి నర్సింహ రెడ్డి(60) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎరువులు కొనుగోలు చేసేందుకు శుక్రవారం ద్విచక్ర వాహనంపై పట్టణ కేంద్రానికి వచ్చాడు. స్థానిక అయ్యప్పగుడి సమీపంలోని ఎరువుల దుకాణంలోకి వెళ్లేందుకు వాహనంపై రోడ్డు దాటుతుండగా సిద్దిపేట వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ నర్సింహ రెడ్డిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మెదక్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు

మెదక్ మున్సిపాలిటీ: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. పట్టణ సీఐ మహేష్ వివరాల ప్రకారం.. ఈనెల 3వ తేదీన అర్ధరాత్రి పట్టణ శివారులోని గాంధీ నగర్ కాలనీ వద్ద గుర్తు తెలియని వృద్ధురాలిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆమె మృతి చెందింది. సుమారు 70 ఏళ్లు ఉంటాయని, మృతదేహం ఏరియాస్పత్రిలో ఉన్నట్లు తెలిపారు. మృతురాలు పింక్ కలర్ జాకెట్, బ్లూ కలర్ పూలతో ఉన్న చీర ధరించి ఉంది. వివరాలు తెలిసినవారు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ Sri Padmavathi School of Nursing Recognised by T.G. NMC, Hyderabad & Govt. of T.G, Sanga Reddy Town & Dist. Pin-502001, GNM Staff Nurse Course Management Seats Available Contact: 9154513999, 8309389464 [H-1028418]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9848571888, 9640400073 [SCA25005909]

■ రామకృష్ణ ఓల్డేజ్‌హోం నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబీకేర్ కై M/F వర్కర్స్ కా॥ బో+వసతి + జీతం: 16-18 వేలు ఏజెంట్లకు 5వేలు కమీషన్ ఫోన్ : 9281465319, 9010680011 [SCA25005822]

FACULTY TEACHERS

■ Wanted Special Educator. B.Ed, HI for a School - JACKSON MISSION SCHOOL. Contact: 8885800489, 7075102777. [SCA25005929]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.